ప్రజాశక్తి



ఆదివారం 12 నవంబర్ 2023

5

విజయనగరం

మంత్రి బొత్సకు గుండె శస్త్రచికిత్స

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణకు శనివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గుండె శస్త్రచికిత్స జరిగింది. ఇటీవల శృంగవరపుకోటలో జరిగిన వైసిపి సామాజిక సాధికార బస్సుయాత్రలో ఆయన అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయనను విశాఖ తరలించగా, గుండె సంబంధిత సమస్య ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు బొత్సను హైదరాబాద్ తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు చేసిన వైద్యులు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలని సూచించారు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో ఆపరేషన్ జరిగింది. నెల రోజులు వరకు హైదరాబాద్ ఆసుపత్రిలోనే విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు తెలిసింది.

విద్యార్థినులపై లైంగిక వేధింపులు

- బయటకు రానివ్వకుండా చక్రం తిప్పిన ఎంఇఒ?
- విచారణ చేపట్టిన విద్యా శాఖ అధికారులు

పాఠశాలలో విచారణ చేపడుతున్న విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, పూసపాటిరేగ

విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువు విద్యార్థినులపై లైంగిక వేదింపులకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పూసపాటిరేగ మండలం చోడమ్మ అగ్రహారం ఎంపియుపి పాఠశాలలో పని చేస్తున్న శంకర్ నాయుడు అనే ఉపాధ్యాయుడు విద్యార్థినులపట్ల లైంగిక వేదింపులకు పాల్పడినట్లు తెలిసింది. ఇదే విషయమై మండల విద్యాశాధికారులకు కూడా గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన గత మంళవారం జరగ్గా విషయం బయటకు రాకుండా గ్రామస్థులతో రహస్య మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. విద్యార్థిని తల్లిదండ్రులను, ఫిర్యాదు చేసేందుకు వచ్చిన యువకులను అదే ఊరిలో ఓ ఇంటిలో సమావేశపరిచి విషయం బయటకు రాకుండా ఆ ఉపాధ్యాయుడ్ని కాపాడే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. శనివారం సాయంత్రం జిల్లా విద్యాశాఖాధికారులకు విషయం తెలియడంతో ఉపాధ్యాయుడి తీరుపై విద్యాశాఖ కార్యలయంలో చర్చకు దారితీసింది.

చక్రం తిప్పిన ఎంఇఒ?

ఉపాధ్యాయుడిపై చర్య తీసుకోవాల్సిన ఎంఇఒ రాజ్‌కుమార్ విషయం బయటకు రాకుండా చక్రం తిప్పినట్లు ప్రచారం జరుగుతోంది. విద్యార్థినులు, తల్లిదండ్రులు మంగళవారం మండల విద్యాశాధికారికి ఫిర్యాదు చేయగా, రాత పూర్వక ఫిర్యాదు తీసుకోకుండా తాను వచ్చి చూస్తానని చెప్పి తల్లి దండ్రులకు నచ్చచెప్పి స్కూలు సమయం అయిన తర్వాత ఆ గ్రామానికి వెళ్లి ఓ ఇంట్లో తల్లి దండ్రులను, పెద్దలను , ఉ పాధ్యాయుడిని కూర్చోబెట్టి చర్చించినట్లు తెలిసింది. ఉపాధ్యాయుడిని మందలించి. తల్లిదండ్రులను ఒప్పించి గొడవ సద్దుమణిగేలా ఎంఇఒ చక్రం తిప్పినట్లు తెలిసింది. ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు తీసుకోవాల్సిన అధికారి ఈ విధంగా వ్యవహరించడం పట్ల కొంత మొత్తం చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విచారణ చేపట్టిన విద్యా శాఖ అధికారులు..

విద్యార్థులపై ఉపాధ్యాయుడు శంకరనాయుడు లైంగిక వేదింపులకు పాల్పడిన ఘటనపై డిఇఒ లింగేశ్వరరెడ్డి స్పందించి విచారణకు ఆదేశించారు. గ్రామంలో విచారణ చేసి రిపోర్ట్ ఇవ్వాలని పూసపాటిరేగ హెచ్ఎం శంకరావుకు ఆదేశాలు జారీ చేశారు. దాంతో ఆయన శనివారం పాఠశాలకు చేరుకొని హెచ్ఎం వై. జయంతిమాలతో పాటు ఉపాధ్యాయులను, గ్రామంలో ఫిర్యాదుదారులను, ఎస్ఎంసి ఛైర్మన్ పైడిరాజును, సర్పంచి కొత్తకోట శ్రీరాములును పాఠశాలకు పిలిపించి విచారణ చేసారు. ఉపాధ్యాయుడిపై వచ్చినవి ఆరోపణలు కాదని, వాస్తవంగా జరిగిందని ఎంఇఒకు ఫిర్యాదు చేసామని గ్రామస్తులు తెలిపారు.

బ్యాడ్ టచ్, గుడ్ టచ్ ఏదో తెలియని విద్యార్థులను లైంగికంగా వేధిస్తున్నది వాస్తవమని తెలిపారు. అయితే లైంగికంగా ఇబ్బంది పడుతున్న విద్యార్థులను మీ ముందుకు తీసుకురాలేమని, అవసరమైతే ఒక్కొక్కరిని మీ ముందు ఉంచే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఇలాంటి విషయాలు బయటకు రాకూడదని ఉద్దేశంతోనే ఎంఇఒకు కూడా ఓరల్‌గా ఫిర్యాదు చేసామన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే పేరెంట్ మీటింగ్ పెట్టామని ఎస్ఎంసి ఛైర్మన్ పి.పైడిరాజు తెలిపారు. ఈ విషయం బయటకు రాకూడదనే ఉద్దేశంతో గ్రామ సర్పంచికి కూడా చెప్పలేదన్నారు. ఈ విషయం తెలిస్తే మిగతా తల్లిదండ్రులు పిల్లలను మాన్పిస్తారని ఆవేదన వ్యక్తం చేసారు. సర్పంచి శ్రీరాములు స్పందించి ఇకపై ఇలాంటి చెడ్డపనులు చేసి మా ఊరుకు, ఉపాధ్యాయ వృత్తికి మచ్చతేవొద్దని హెచ్చరించారు. నివేదికను డిఇఒకు పంపుతామని హెచ్ఎం తెలిపారు.

మొదటి నుంచి వివాదాస్పదుడే?

శంకర్ నాయుడు మొదటి నుంచి వివాస్పదుడుగానే ముద్ర పడ్డాడు. విజయనగరం కెఎల్ పురంలో ఉంటున్న ఆయన గతంలో సాధారణ ఎన్నికల్లో ఓ రాజకీయ పార్టీకి మద్దతిచ్చి ఎన్నికల్లో బాహటంగానే తిరిగి విద్యాశాఖనుంచి మోమో అందుకున్నారు. గంట్యాడ మండలంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన సమయంలో ఎంఇఒ సంతకం ఫోర్జరీ చేశాడు. ఆయన ఎక్కడి పని చేస్తే అక్కడ వివాదాలు తెచ్చుకోవడం పరిపాటిగా మారింది.

రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు, గొర్రెలు, మేకల పెంపకందారులు

జీవనాధార భూములు లాక్కోవద్దు

జాతీయ రహదారిపై సిపిఎం ఆధ్వర్యాన రాస్తారోకో

ప్రజాశక్తి-దత్తిరాజేరు

చిన్నచామలాపల్లిలో గొర్రెలు, మేకల పెంపకందారులకు జీవనాధారమైన భూములను కృషి విజ్ఞాన కేంద్రం కోసం లాక్కోవద్దని కోరుతూ శనివారం మానాపురం సంతతోట వద్ద జాతీయ రహదారిపై సిపిఎం ఆధ్వర్యాన రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు చిన్నచామలాపల్లిలో గొర్రెలు, మేకలు పెంపకంపై ఆధారపడిన కొండ భూమిని లాక్కోవడం జీవాలను చంపడమేనని ఆందోళన వ్యక్తంచేశారు. ఆ నిర్ణయం వృత్తిదారుల జీవనం తుంగలో తొక్కడమేనని, జీవించే హక్కుని హరించి వేయడమేనని చెప్పారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో ప్రభుత్వం భూమిని సేకరించిందని, ఆ భూముల్లో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయడానికి ఆటంకమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను కంపెనీలకు ఇచ్చేసి మూగజీవాల భూములు లాక్కోవడం సిగ్గుచేటన్నారు. చుట్టూ ఉన్న అనేక ప్రాంతాల్లో సేకరించిన ప్రభుత్వ భూముల్లో కెవికె ఏర్పాటుకు సిద్ధం కావాలి తప్ప చిన్నచామలాపల్లి కొండ భూమికి వస్తే వృత్తిదారులు ఊరుకోరని హెచ్చరించారు.

ఈ విషయంపై ఇప్పటికే తహశీల్దార్, ఆర్‌డిఒ, కలెక్టర్‌కు వినతులు అందజేసినా, మొండిగా భూమి సేకరణకు సిద్ధం కావడం చాలా దుర్మార్గమని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పెంపకందారులకు సిపిఎం అండగా నిలుస్తుందని స్పష్టంచేశారు. వీరికి అన్ని పార్టీలు మద్దతు తెలియజేసి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.శ్రీనివాస్, రాకోటి రాములు, రాము, దుర్గాప్రసాద్, హర్ష, మాజీ ఎంపిటిసి ఎం.ఎరుకునాయుడు, తిరుపతిరావు, శంకరరావు, లక్ష్మణ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి, తదితరులు

బాలలకు భద్రత కల్పించాలి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం కోట

బాలలకు భద్రత కల్పించి, వారి హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ ఆధ్వర్యాన బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకొని రూపొందించిన గోడపత్రికను కోలగట్ల వీరభద్రస్వామితో పాటు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ కోసం అందరూ సమన్వయంతో పనిచేయాలని వారి హక్కులుకు భంగం కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాలలు విద్య, వైద్యం కోసం అనేక అభివృద్ధి కార్యమాలు చేపడుతోందన్నారు. ప్రాధాన్యత ఇచ్చి అధిక నిధులను కేటాయిస్తుందని తెలిపారు. ముఖ్యంగా పాఠశాలల్లో నూతన తరగతులు నిర్మాణం, మరుగుదొడ్లు, తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించడం, డిజిటల్ తరగతులు, ఇంటర్నెట్ సదుపాయాలు, టాబ్ లు పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. కేసలి అప్పారావు మాట్లాడుతూ ఈ నెల 14 నుండి 20 తేదీ వరకు బాలలు హక్కులు వారోత్సవాలు రాష్ట్రమంతటా అందరి సహకారంతో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వి రాజేష్, కార్పొరేటర్లు ధనలక్ష్మి, సత్యనారాయణ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఇంఛార్జి అధికారి యాళ్ల నాగరాజు, మిషన్ వాత్సల్య సిబ్బంది, వైసిబి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

‘చలో విజయవాడ’ విజయవంతానికి ప్రచారం

ప్రజాశక్తి-బొబ్బిలి, తెర్లాం

ఈ నెల 15న విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరి సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు కోరారు. ప్రజా రక్షణభేరి సభను జయప్రదం చేయాలని బొబ్బిలి, తెర్లాం, బాడంగి, రామభద్రపురం మండలాల్లో ఆటో ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిపిఎం బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం మండలాల కార్యదర్శులు ఎస్.గోపాలం, సురేష్, బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : ప్రజా రక్షణ భేరిలో భాగంగా ఈ నెల 15న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్రావు, నగర కమిటీ సభ్యులు వి.లక్ష్మి కోరారు. శనివారం నగరంలోని వైఎస్ఆర్ కాలనీలో ఇంటింటికి సిపిఎం ప్రజాప్రణాళికను పంపిణీ చేశారు. అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను చేపట్టిందని వారు తెలిపారు. అందులో భాగంగా 15న విజయవాడలో భారీగా బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే సురేష్, చిన్నారి, రాము, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : ఈ నెల 15న ‘ఛలో విజయవాడ’ జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు ఏ.జగన్ మోహన్ రావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక రామతీర్థం జంక్షన్‌లో నగర పంచాయతీ కార్మికులతో కలిసి ఆయన ప్రచారం చేశారు. కార్యక్రమంలో నగరపంచాయతీ కార్మికులు బాబురావు, దుర్గారావు, శ్రీను, హరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో ఆటో ప్రచారం చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, నాయకులు

వంగర : ఛలో విజయవాడ సిపిఎం ప్రజారక్షణ భేరి బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎంనాయకులు సిహెచ్ రామ్మూర్తి నాయుడు కోరారు. మండలంలో శనివారం జరిగిన ఆటో ప్రచార జాతలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రమణమూర్తి, శంకర్రావు, అప్పల రాము, సత్యారావు, శ్రీనివాసరావు, కృష్ణారావు, రాజేష్, గురువులు పాల్గొన్నారు.

రేగిడి: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల పక్షాన నిలిచేది ఒక్క సిపిఎం పార్టీనేనని సిపిఎం నాయకులు వి. రమణమూర్తి, సిహెచ్ రామ్మూర్తినాయుడు అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని ఉంగరాడ మెట్ట వద్ద ‘చలో విజయవాడ’ సిపిఎం ప్రజా రక్షణభేరి బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆటో ప్రచార జాత నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్రావు, అప్పలరాము, సత్యారావు, శ్రీనివాసరావు, కృష్ణారావు, రాజేష్, గురువులు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

స్క్వేర్ మార్షల్ ఆర్ట్స్‌లో నిరంజన్‌కు కాంస్యం

ప్రజాశక్తి-విజయనగరం

పతకంతో నిరంజన్

జాతీయ స్థాయి స్క్వేర్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో విజయనగరం జిల్లా కు చెందిన నిరంజన్ ప్రసాద్ కాంస్య పతకం సాధించాడు. ఈనెల 7 నుంచి 9వరకు గోవాలో జరిగిన పోటీల్లో 216 మంది పాల్గొనగా, జిల్లాకు చెందిన నిరంజన్ మూడవ స్థానంలో నిలిచాడు. ఆంధ్రప్రదేశ్ నుంచి 8 మంది బాలురు, 8 మంది బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 58 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించిన నిరంజన్ ప్రసాద్‌ను సెట్విజ్ సిఇఒ రాంగోపాల్‌తో పాటు పలువురు అభినందించారు.

జిల్లా ప్రజలకు జెడ్‌పి చైర్మన్ దీపావళి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా ప్రజలకు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అజ్ఞానం అనే చీకటిని పారదోలి.. జ్ఞానం అనే వెలుతురును ప్రసరింపజేసేదే దీపమని విశ్వసిస్తామని, అలాంటి దీపాల పండుగ దీపావళిని జిల్లా ప్రజలు బాగా జరుపుకోవాలని కోరారు.

గురజాడ, వాణిసంతోష్ పాఠశాలల్లో స్నేహ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న కేసలి అప్పారావు, ఎంవిఆర్ కృష్ణాజి, విద్యాసంస్థల ప్రతినిధులు, ప్రజాశక్తి సిబ్బంది

ప్రజాశక్తి స్నేహ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

బాలల దినోత్సవం నేపథ్యంలో ప్రజాశక్తి చిరుమువ్వల పేరిట ముద్రించిన స్నేహ ప్రత్యేక సంచికను శనివారం పలుచోట్ల ఆవిష్కరించారు. నగరంలోని గురజాడ స్కూలులో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, జెవివి జాతీయ అధ్యక్షులు ఎంవిఆర్ కృష్ణాజి తదితరులు ఆవిష్కరించారు. అయినాడ జంక్షన్‌లోగల వాణి సంతోష్ పాఠశాలలో కరస్పాండెంట్ రామకృష్ణ, ఉపాధ్యాయులు ఈ సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభ్యుదయ భావాలుగల ప్రజాశక్తి దినపత్రిక చిన్నారులను ప్రోత్సహించి వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు కథలు, కవితలు, బొమ్మలు సేకరించి పుస్తక రూపంలో తీసుకు రావడం అభినందనీయ మని అన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి వారిని ప్రోత్సహించడంలో ప్రజాశక్తి ముందుంటుం దన్నారు. శాస్త్రీయ ఆలోచనను విద్యార్థులు పెంపొందించు కోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాశక్తి జిల్లా కన్వీనర్ కె.రమేష్ నాయుడు, సిహెచ్ రాము, డిఇ కె. శ్రీనివాసరావు, ఎం.శాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను దగా చేసిన సిఎం

ప్రజాశక్తి-విజయనగరం కోట

నిరుద్యోగులను ముఖ్యమంత్రి జగన్ దగా చేశారని తెలుగుయువత పార్లమెంట్ అధ్యక్షులు వేమలి చైతన్య బాబు అన్నారు. శనివారం కోట జంక్షన్లో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు యువత ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చైతన్యబాబు మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో అధికారంలోకి రాగానే ఖాళీపోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని, కనీసం ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేశారని అన్నారు.ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని హామీ ఇచ్చి నేటికీ నాలుగున్నరేళ్లయినా అతీగతీ లేదన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గొలగాని సురేంద్ర, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మద్దిల ప్రవీణ్, నియోజకవర్గాల అధ్యక్షులు గంటా రవి, పెద్దిరెడ్ల సతీష్,నగర అధ్యక్షులు మాతా బుజ్జి, చిప్పాడ స్వామి, పాలూరి రాజు నాయుడు, కర్రోతు రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెలుగు యువత నాయకులు

పథకాల ముసుగులో పార్టీ ప్రచారమా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాల ముసుగులో పార్టీ ప్రచార పర్వానికి తెరలేపాయా? అంటే మెజార్టీ ప్రజానీకం నుంచి ఔననే సమాధానం వినిపిస్తోంది. ముఖ్యంగా పార్వతీపురం, విజయనగరం జిల్లాల్లో ఈ రకమైన రాజకీయ వికట విన్యాసాలు స్పష్టంగానే కనిపిస్తున్నాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని, ప్రభుత్వ ఖర్చుతో వచ్చే ఎన్నికలే లక్ష్యంగా ప్రచారం సాగిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో గెలిచేవరకే పార్టీ ప్రతినిధి. గెలిచాక రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలందించాల్సివస్తుంది. ఆ అధికారం ఉన్నంత వరకూ ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడాలే తప్ప, తాను ప్రతినిధ్యం వహిస్తున్న పార్టీకి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉపయోగపడే విధంగా వ్యవహరించడానికి వీలు లేదు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా రాష్ట్రం ప్రభుత్వం ‘మా నమ్మకం నువ్వే జగన్’ అంటూ మూడు రోజుల క్రితం చేపట్టిన విషయం విధితమే. 15రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని ఉత్సవంలా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ముందు రోజే ఊరంతా చాటింపులు వేస్తున్నారు. సచివాలయాల వద్ద పార్టీ జెండాలను ఆవిష్కరిస్తున్నారు. టెంట్లు, కుర్చీలు సమకూర్చి ప్రభుత్వ సంక్షేమ పథకాల కంటే వైసిపి, ముఖ్యంగా సిఎం జగన్ కోసమే ఎక్కువ ప్రచారం చేపడుతున్నారు. ఇది ఈనెల 23వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ ప్రచార పర్వం ముగుస్తున్న గ్రామాల్లో ‘ఎపికి జగనన్నే సిఎం ఎందుకు కావాలి’ అంటూ మరో కార్యక్రమం తలపెట్టారు. ఇందులో భాగంగా గ్రామ గ్రామాన ప్రచార బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు ఇంటింటికీ వాలంటీర్లు వెళ్లి వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్ గెలుస్తేనే మేలు జరుగుతుందన్నట్టుగా చెబుతున్నారు. కాదు... కాదు... అలా ప్రభుత్వం వాలంటీలర్లతో బలవంతంగా చెప్పిస్తోంది. ఈ మొత్తం ప్రచార హోరులో వాలంటీర్లతోపాటు సచివాలయ సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేయడం

గమనార్హం. ప్రభుత్వ వైఖరిపై భిన్నమైన అభిప్రాయాలు ఉన్న సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు మాత్రం మాకేంటీ ఖర్మ అంటూ తూతూ మంత్రంగానే ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ మొత్తం కార్యక్రమానికి మండల స్థాయిలో ఇఒపిఆర్‌డిని నోడల్ ఆఫీసర్‌గా నియమించడం పట్ల కూడా అధికారులు, ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి, అసహనం వ్యక్తమౌతోంది. ఎంతకి అధికారం ఉంటే మాత్రం ప్రభుత్వ అధికారులు, సిబ్బందిని పార్టీకోసం ఇంతలా వాడుకోవడమా? అంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

మరోవైపు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇదే పద్ధతిలో వ్యహరిస్తోంది. ఈనెల 15వ తేదీ నుంచి ‘వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర’ పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించేందుకు సన్నద్ధమైంది. దేశవ్యాప్తంగా గిరిజనులు నివసిస్తున్న 110 జిల్లాలో తొలి విడతగా ఈ యాత్ర నిర్వహించేందుకు పథకం రూపొందించింది. ఈ కార్యక్రమం రాష్ట్రంలో పార్వతీపురం మన్యం జిల్లా నుంచి శ్రీకారం చుట్టేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే మండలాల వారీగా యాత్ర షెడ్యూల్ కూడా ఖరారైంది. ఇందులోనూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రచారం చేస్తామని ప్రభుత్వం బటయకు చెప్తున్నప్పటికీ, గిరిజన ప్రాంతంలో ఎన్నికల అజెండాలో భాగంగానే ఈ యాత్ర సాగుతుందని పలువురు విశ్లేషిస్తున్నారు. పోడు భూములపై గిరిజనులకు హక్కు కల్పించే అటవీహక్కుల చట్టాన్ని సరిగా అమలు చేయలేదు సరికాదా, తిరిగి ఆ చట్టానికి తూట్లు పొడుస్తున్న బిజెపి ప్రభుత్వం గిరిజనులను మాయ మాటలతో నమ్మించి, వచ్చే ఎన్నికల్లో మరోసారి రాజకీయంగా లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తోందని గిరిజన సంఘం, సిపిఎం తదితర ప్రగతిశీల శక్తులు చెబుతున్నాయి. ఇందుకనుగుణంగా గిరిజనులకు రక్షణ కవచంగా వున్న 1/70 చట్టం బిజెపి అధికారంలోకి వచ్చాక నీరు గారుసోతంది. ఇటువంటివన్నీ కప్పిపుచ్చుకనేందుకే ఈ యాత్ర నిర్వహిస్తున్నారని పలువురు వాఖ్యానిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికార దుర్వినియోగానికి పాల్పడడమే కాకుండా, ప్రభుత్వ సొమ్ముతో పార్టీ ప్రచారాలు చేసుకుంటున్నాయని జనం అంటున్నారు.

వరిచేను కోస్తున్న రైతులు

వరి కోతల్లో రైతులు బిజీబిజీ

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ మండలంలో రెండు రోజులుగా రైతులు ఖరీఫ్ వరి పంట కోతల పనుల్లో బిజీగా ఉన్నారు. వేపాడ, జగ్గయ్యపేట, అరిగిపాలెం, వల్లంపూడి, వీలుపర్తి గ్రామాల్లో వరిపంట కోతలు ప్రారంభమయ్యాయి. కొన్ని గ్రామాల్లో వర్షాభావంతో వరి పంటంతా ఎండిపోయిన విషయం తెలిసిందే. నీటివనరులున్న చోట్ల ప్రస్తుతం పంట చేతికందడంతో రైతులు కోతలు చేపడుతున్నారు. మరోవైపు ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

పరదాల్లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

పరదాల మాటున బాణసంచా విక్రయాలు

ప్రజాశక్తి- గజపతినగరం

దీపావళి సందర్భంగా గజపతినగరంలోని బాణాసంచా విక్రయాలు జోరందుకున్నాయి. అనుమతులు లేకుండా పరదాల మాటున మందుగుండ విక్రయాలు సాగుతున్నాయి. పండగ సందర్భంగా ప్రజల అవసరాన్ని ఆనందాన్ని అవకాశంగా మలుచుకోవాలని సేఫ్టీ భద్రతా నియమాలను సైతం పక్కనపెట్టి పట్టణానికి ఆనుకొని మూడు దుకాణాలు ఏర్పాటయ్యాయి. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. బాణాసంచా పేలుడుతో పలుచోట్ల ప్రాణ నష్టం జరిగిన సంఘటనలు మరిచి బాణాసంచా విక్రయదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా, అధికారులు చోద్యం చూస్తున్న తీరు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

ప్రాజెక్టును తిలకిస్తున్న జిల్లా ఫుడ్ స్టేఫ్టీ అధికారి వెంకటరమణ

ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కోరుకొండ వద్దనున్న వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో అందరినీ ఆకట్టుకుంది. శనివారం ఈ సైన్స్ ఎక్స్‌పోను జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి పి.వెంకటరమణ, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు బీశెట్టి బాబ్జీ ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపల్ బి.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ పిల్లల్లో లోతైన ఆలోచనలను, సమాజానికి ఉపయోగ పడే ఆవిష్కరణలు చేయడానికి ఇదొక మంచి వేదిక అన్నారు. కార్యక్రమంలో సుమారు 180 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమలో పాఠశాల డైరెక్టరు తోట వీరాస్వామి ఉపాధ్యాయులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా నాగేశ్వరరావు, టి.రాంబాబు, కేంద్రీయ విద్యాలయ అధ్యాపకులు రమేష్ వ్యవహరించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో జిల్లాకు పతకాల పంట

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖలోని బుల్లయ్య కాలేజి మైదానంలో శనివారం జరిగిన ఆంధ్రా యూనివర్సిటీ ఇంటర్ కాలేజి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో జిల్లా క్రీడాకారులు పతకాల మోత మోగించారు. ఎస్. పల్లవి 64 కేజీల కేటగిరిలో గోల్డ్ మోడల్ సాధించింది. సిహెచ్ శ్రీలక్ష్మి 81 కిలోల కేటగిరిలోను, ఆర్.రాంబాబు 81 కిలోల కేటగిరిలోను, ఎం.మణికంఠ 89 కిలోల కేటగిరిలోను గోల్డుమెడల్ సాధించారు. వీరంతా విజయనగరం సత్య డిగ్రీ కాలేజ్‌లో చదువుతున్నారు. అలాగే వై.చైతన్య కుమారి 87 కిలోల కేటగిరిలో గోల్డ్ మెడల్ సాధించింది. అయ్యన్నపేటలోని ఎస్‌కె డిగ్రీ కళాశాలలో ఈమె డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బెల్లాన లక్ష్మి, కార్యదర్శి చల్లా రాము, సత్యకాలేజి డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కోచ్ శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

ఎమ్మెల్యే శంబంగికి సత్కారం

ప్రజాశక్తి-బొబ్బిలి

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడును జర్నలిస్టులు సత్కరించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కె.వాసు, ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు వ్యాసుబాబు మాట్లాడుతూ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు వచ్చేలా నిబంధనలు సడలించాలని ఎమ్మెల్యే శంబంగిని కోరారు. దీనిపై శంబంగి స్పందిస్తూ అర్హులందరికీ ఇళ్ల స్థలాలు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

శంబంగిని సన్మానించిన న్యాయవాదులు

కోర్టు భవన సముదాయానికి ప్రభుత్వం రూ.31.20 కోట్లు మంజూరు చేయడంతో ఎమ్మెల్యే శంబంగిని న్యాయవాదులు వైసిపి కార్యాలయంలో సన్మానించారు. ఎమ్మెల్యే కృషితో కోర్టు భవన సముదాయానికి నిధులు మంజూరయ్యాయని బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంటి గోపాలకృష్ణ శర్మ, సభ్యులు ఎం.జగన్నాథం, జె.శ్రీనివాసరావు, న్యాయవాదులు అన్నారు.

'నేను సైతం' సేవలకు గుర్తింపు

ప్రజాశక్తి-బొబ్బిలి

నేను సైతం స్వచ్ఛంద సంస్థ ద్వారా పేదలకు ఆహారం పంచుతున్న బొంగు సంతోష్, లంక వాసును విశాఖ అక్కినేని ఫ్యాన్స్ అధ్యక్షులు శ్రీను, సభ్యులు నవీన్ ప్రసాద్, ఈశ్వరరావు సన్మానించారు. కొన్నేళ్లుగా పేదల ఆకలి తీర్చేందుకు నేనుసైతం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నారు. తమ సేవలకు గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉందని సంతోష్, వాసు అన్నారు.

మొక్కజొన్నపై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని తంగుడుబిల్లిలో శనివారం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీరో టిల్లేజ్ మొక్కజొన్న సాగు పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయ కర్త శ్రీనివాసరావు మాట్లాడుతూ వరిపంట అనంతరం జీరో టిల్లెజ్ మొక్క జొన్న సాగు చేసి అధిక ఆదాయం పొందవచ్చునన్నారు. తక్కువ ఖర్చుతో రెడ్డీస్ ఫౌండేషన్ డబుల్ వీల్ మార్కర్, డ్రం సీడర్, అగ్రో ఫారెస్ట్, ఏడబ్ల్యుడి పాని పైపులు వంటి పరికరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

నిలిచిన అదనపు భవనం పనులు

ప్రజాశక్తి - వేపాడ

నాడు నేడు రెండో విడత అదనపు భవనాల నిర్మాణపు పనులు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో పాఠశాలల విద్యార్థులు గదులు చాలాక ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే నిలిపివేసినట్లు చెబుతున్నారు. దీంతో ఎప్పటి మాదిరిగానే విద్యార్థులు చాలీచాలని ఇరుకు గదుల్లో చదువులు వెళ్లదీయాల్సి వస్తుంది. ప్రభుత్వం విద్యకు వేల కోట్లు వెచ్చిస్తున్నట్లు ప్రకటనలో చేస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం అమలు కాకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది.

ముఖ్యంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దొంగాడ ఎంపిపి పాఠశాల, కేజీబీవీ వసతి గృహం, వావిలపాడు జిల్లా పరిషత్ పాఠశాల, సోంపురం జిల్లా పరిషత్ పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణపు పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తిస్థాయిలో అదనపు గదులకు అవసరమైన నిధులను విడుదల చేసి పనులు పూర్తి చేస్తే తప్ప ప్రభుత్వ ఆశయం నెరవేరే అవకాశాలు లేవని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

మధ్యలో నిలిచిపోయిన పనులు

22న బొబ్బిలిలో వైసిపి బస్సుయాత్ర

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలిలో ఈ నెల 22న జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కోరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిసిల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతమైందన్నారు. రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటికీ వైసిపి నాయకులు, కార్యకర్తలు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయం తీసుకుంటున్నారని చెప్పారు. బస్సు యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. జిల్లా, బొబ్బిలిలో బిసిలు ఎక్కువ శాతం ఉన్నారన్నారు. కళాభారతి ఆడిటోరియం జంక్షన్ వద్ద జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగే బస్సుయాత్రకు ఉప ముఖ్యమంత్రులు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, అమర్నాథ్, ఎమ్మెల్యేలు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైసిపి పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, జెసిఎస్ కన్వీనర్లు రేజేటి విస్సు, టి.దామోదర్, శంబంగి వేణుగోపాలనాయుడు, ఇంటి గోపాలరావు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాడిని ఖండించండి

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, ముస్లిములు

ప్రజాశక్తి-వేపాడ

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఖండించాలని శనివారం మండలంలోని బొద్దాంలో సిపిఎం నాయకులు చల్లా జగన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అమెరికా అండతో ఇజ్రాయిల్.. గాజా ప్రాంతాన్ని సర్వ నాశనం చేస్తోందని జగన్ ఆందోళన వ్యక్తంచేశారు. దాడుల్లో పేదలు, మహిళలు, చిన్నారులు బలవుతున్నారని వాపోయారు. మారణకాండకు కారణమైన ఇజ్రాయిల్ దురహంకారాన్ని ప్రజానీకమంతా ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. వెంటనే ఇజ్రాయిల్ దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చలుమూరి శ్యామ్, ముస్లిం పెద్దలు అబ్దుల్లా, బుడా, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఐక్యత సమాజానికి మేలు

జనసేన నాయకులు గురాన అయ్యలు ● జర్నలిస్టులకు దివాళీ కానుకలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జర్నలిస్ట్‌ల ఐక్యతే సమాజానికి మేలు చేస్తుందని, తద్వారా మంచి సమాజాన్ని, దేశాన్ని నిర్మించుకోగలమని జనసేన నాయకుడు గురాన అయ్యలు అన్నారు. దీపావళిని పురస్కరించుకొని శనివారం విజయనగరం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నగరంలోని వర్కింగ్ జర్నలిస్ట్‌లకు దివాళీ గిఫ్ట్‌లను అయ్యలు వితరణగా అందించారు. ఈ సందర్భంగా అయ్యలు మాట్లాడుతూ జర్నలిస్ట్ లంతా ఒక తాటిపై ఐక్యంగా కనిపించడం సంతోషాన్ని కలిగించిందన్నారు. అంతా ఐక్యంగా ఉంటేనే సమాజంలోని రుగ్మతలను పారద్రోలగలరని, పాలనలో అవినీతిని రూపుమాపగలరని అన్నారు. తమ తండ్రి గురాన సాధురావు నాటి కాలం నుంచి అయన వారసత్వంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూనే ఉన్నామని, జర్నలిస్ట్ లకు తమ కుటుంబంతో అవినాభవ సంబంధం ఎల్లప్పుడూ కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. జర్నలిస్ట్ మిత్రులకు ఏ అవసరం వచ్చినా తన వంతుగా ముందుంటానని అన్నారు. అనంతరం ప్రెస్ క్లబ్ ప్రతినిధులు అయ్యలను సత్కరించారు. నగరంలోని శ్రీరామ ఫైర్ వర్క్స్ యజమాని రవ్వా శ్రీనివాస్ రావు కూడా ప్రెస్ క్లబ్ జర్నలిస్ట్‌లకు బాణాసంచా సామగ్రి అందజేశారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన గురాన అయ్యలు, విశిష్ట అతిధిగా విచ్చేసిన డిపిఆర్‌ఒ డి.రమేష్ చేతుల మీదుగా ఈ గిఫ్ట్‌లను జర్నలిస్ట్‌లకు అందించారు. కార్యక్రమంలో నగరంలోని జర్నలిస్టులంతా పాల్గొన్నారు.



దివాళీ కానుకలను పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు గురాన అయ్యలు

ఘనంగా ఆజాద్ జయంతి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో 'మైనారిటీస్ వెల్ఫేర్ డే' ను శనివారం ఘనంగానిర్వహించారు. స్పెషల్‌బ్రాంచి సిఐ ఇ.నర్సింహమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మౌలానా అబుల్ కలాం అజాద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడుగా, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం అజాద్ 11ఏళ్లగా నిర్విరామంగా పని చేసి, జాతీయాభివృద్ధికి, విద్యారంగాన్ని బలోపేతంచేసేందుకు విశేషంగా కృషి చేసారన్నారు. అటువంటి మహనీయుని జన్మ దినాన్ని 'జాతీయ విద్యా దినోత్సవంగా, 'మైనారిటీస్ వెల్ఫేర్ డేగా నిర్వహించు కోవడం గొప్ప విషయమన్నారు. తొలి విద్యాశాఖామంత్రిగా మౌలానా అబుల్ కలాం అజాద్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు రమణమూర్తి, ఎన్. గోపాల నాయుడు, ఎస్‌ఐ వాసుదేవ్, ఆర్.ఎస్.ఐలు నారాయణరావు, రామకృష్ణ, నీలిమ, ప్రసాదరావు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంకోట.. ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో..

మౌలానా అబుల్ కలాం జయంతినికాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్, ఎపిసిసి మైనార్టీ వైస్ ఛైర్మన్ ఎమ్‌డి హస్సేన్ షరీఫ్ కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ తొలి ప్రధాని గౌరవ పండిట్ నెహ్రూ ,ఆయన లిమంత్రివర్గంలో విద్యా శాఖ మంత్రిగా కలాం పనిచేసి విశేష సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్, సీనియర్ నాయకులు అబ్దుల్ ఖరీమ్, ఎస్.కె.సమీరా, ఖాజా, మక్బుల్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : స్థానిక కోరాడవీధిలో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని శనివారం హుదా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యా అభివృద్ధికి ఆజాద్ చేసిన కృషిని అసోసియేషన్ సభ్యులు ప్రశంసించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శృంగవరపుకోట : మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శనివారం మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రహీం షేక్ లాల్, ఎస్‌విఎస్‌ఎన్ మూర్తి, ఎ.సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

చీపురుపల్లి : మండలంలోని జి.అగ్రహారం గ్రంథాలయం ఆవరణలో ఆశయ యూత్ అసోసియేషన్, ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో శనివారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతదేశ మొదటి విద్యా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ, విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ.. ప్రచారం చేపడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే పల్లెనిద్ర

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బొద్దాం గ్రామంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన పల్లెనిద్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొన్నారు. శనివారం ఉదయం అల్పాహారం తీసుకుని స్థానిక నాయకులతో కలిసి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి డి.సత్యవంతుడు, డిసిసిబి ఛైర్మన్ వివి చినరామినాయుడు, వైసిపి మండల అధ్యక్షులు జగ్గు బాబు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు,

కొత్తవలస : ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా కొత్తవలస-3 సచివాలయ పరిధిలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పల్లెనిద్ర చేశారు. అనంతరం వైసిపి కార్యకర్తల, ముఖ్య నాయకులతో కలిసి టీ దుకాణంలో అల్పాహారం తీసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు శాఖ గ్రంథాలయాధికారి దామోదర శ్రీధర్ తెలిపారు. ఈ వారోత్సవాల్లో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-దత్తిరాజేరు

యుటిఎఫ్ దత్తిరాజేరు మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. శనివారం మండలంలోని కోమటిపల్లి పాఠశాలలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి చింత భాస్కరరావు, జిల్లా సహాధ్యక్షులు వి.ప్రసన్నకుమార్ పర్యవేక్షణలో ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షులుగా మామిడి చంద్రావు, ప్రధాన కార్యదర్శిగా టి.రమేష్, గౌరవ అధ్యక్షులుగా ఎన్.ధనంజయరావు, కోశాధికారిగా చంద్రశేఖరరావు, ఉపాధ్యక్షులుగా మాధవి లత, జి.వెంకట్రావు, జిల్లా కౌన్సిలర్లుగా కిల్లాడ అప్పారావు, ఆర్.రామునాయుడు, పి.రాంప్రసాద్, ఎం.శివప్రసాద్, జి.గంగులు, ఎ.పకీర్ నాయుడు, జి.సత్యం, ఉమామహేశ్వరరావు, స్వామినాయుడు ఎన్నికయ్యారు.

మహిళతో మాట్లాడుతున్న జనసేన నాయకురాలు మాదవి

మన ఊరిలో జనవాణి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని కొత్తపేటలో జనసేన ఆధ్వర్యంలో మన ఊరిలో జనవాణి కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఇందులో భాగంగా జనసేన నాయకులు లోకం మాధవి కొత్తపేట, టొంపల పేట గ్రామాలను సందర్శించి ప్రజా సమస్యలను తెలిసికొని జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా గ్రామాలలో డిగ్రీ చదువుకున్న నిరుద్యోగులు ఎక్కువగా ఉన్నారని వారికి ఎటువంటి సౌకర్యాలూ కల్పించలేదన్నారు. వీధి దీపాలు, కాలువలు సరిగా లేవని, పథకాలు అమలు తీరులో అధికార వైసిపి పక్షపాత తీరు వ్యవహరిస్తోందని, ఈసారి వైసిపికి ఓటు వేయమని ఈ సందర్భంగా ఆమెకు గ్రామస్తులు చెప్పారు. అనంతరం పలు కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయి. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ గుర్తు గాజు గ్లాసుపై ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన నాయకులు సువ్వాని రమణ, గోవింద్, లోకేష్, మోహన్, నారాయణరావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'సీతం'లో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం ఇంజినీరింగ్ కళాశాలలో గ్రంథాలయ విభాగం ఆధ్వర్యాన జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెఎన్‌టియుజి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీకుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి విద్య అనేది ప్రాథమిక హక్కు అని, దీనిని ప్రతి విద్యార్థి సక్రమమైన పద్ధతిలో నేర్చుకుని భావితరాలకు ఉపయోగకరంగా ఉండాలని తెలిపారు. కళాశాల సంచాలకులు డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ ఒక వ్యక్తి ఒక శక్తిగా మారాలంటే విద్యను ఆయుధంగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ వెంకట లక్ష్మి పాల్గొన్నారు. విద్యార్థులలో ఉత్తమ వక్తలకు డాక్టర్ శ్రీకుమార్ బహుమతులు అందచేశారు.

పేద కుటుంబానికి చిన్న శ్రీను సోల్జర్స్ ఆసరా

విజయనగరం టౌన్ : పేద కుటుంబానికి చిన్న శ్రీను సోల్జర్స్ ఆసరాగా నిలిచారు. నగరంలోని లంకాపట్నానికి చెందిన నిమ్మల గోవింద, కామేశ్వరి దంపతులు జీవనోపాధి కల్పించాలని చిన్న శ్రీను సోల్జర్స్‌ను కోరారు. వెంటనే చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరి సహస్ర స్పందించి వారికి టిఫిన్ వ్యాపారం చేసుకొనుటకు కావలసిన సామగ్రిని , తోపుడు బండిని సమకూర్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తోట వాసు, కార్యదర్శి జాకీర్ హుస్సేన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోళ్ల లలితకుమారి

గోపాలపల్లిలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని గోపాలంపల్లి గ్రామంలోని మాజీ ఎంపిటిసి వి.శివరామకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ నూకల సత్యారావు ఆధ్వర్యంలో శనివారం బాబు షూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోళ్ల లలితకుమారి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. టిడిపి మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బోనంగి జ్యోతి, ఉప సర్పంచ్ మూకల కృష్ణవేణి, బి.రామలింగం, మూకల ఉపేంద్ర, ఎం.వి.అప్పలనాయుడు, చొప్ప రామయ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అనుమతుల్లేకుండా టపాసుల విక్రయం

వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని అంబకండి గ్రామానికి చెందిన ఓ వ్యాపారి అనుమతులు లేకుండా టపాసులు విక్రయాలు జరిపినందుకు శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అనుమతులూ లేకుండా గ్రామాల్లో మందు గుండు సామాగ్రి అమ్మితే అరెస్టు చేస్తామన్నారు. ఇప్పటికే గ్రామాల్లో విస్తృత దాడులు జరుగుతున్నట్లు వెల్లడించారు.

9 మంది పేకాట రాయుళ్లు అరెస్ట్

మండలంలోని బూరాడ గ్రామ చెరువు సమీపంలో శనివారం సాయంత్రం పేకాడుతున్న 9 మంది జూదగాళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. వీరి నుంచి రూ.59,999 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం

రూరల్ పోలీసు స్టేషనులో ఈ నెల 6న నమోదైన చోరీ కేసులో నిందితుడు బొందిలి దిలీప్ కుమార్‌ను అరెస్టు చేసి అతని నుంచి 8 తులాల బంగారు ఆభరణాలనురికవరీ చేసినట్లు సిఐ టివి తిరుపతిరావు తెలిపారు.శనివారం స్టేషన్‌లో నిర్వహించినవిలేకర్ల సమావేశంలో చోరీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. విజయనగరం మండలం ద్వారపూడి గ్రామ పంచాయతీ వినాయక్ నగర్ లో నివాసం ఉంటున్న ఈర్ల హిమమణి, ఆమె భర్త సూర్య ప్రకాష్ ప్రభుత్వ టీచర్లుగా పని చేస్తూ ఈనెల 6న యధావిధిగా స్కూల్ కు వెళ్లిపోయారని తెలిపారు. మధ్యాహ్నం భోజనం సమయంలో హిమ మణి ఇంటికి వచ్చి, ఇంటిలో గల 8తులాల బంగారు ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు గుర్తించారని తెలిపారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, రూరల్ ఎస్ఐ గణేష్ దర్యాప్తు చేపట్టారు. రూరల్ ఎస్ఐ గణేష్ మరియు ఇతర పోలీసులు రెండు బందాలుగా ఏర్పడి, దర్యాప్తు చేపట్టారని తెలిపారు. వారి ఇంటి ఎలక్ట్రికల్ పనులను గతంలో చేసిన కాలిఘాట్ కాలనీకి చెందిన బొందిలి దిలీప్ కుమార్ ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు.

మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని దేవి జంక్షన్ వద్ద అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్నారన్న సమాచారంతో సిమ్మ ఆదినారాయణను ఎస్ఇబి సిబ్బంది తనిఖీ చేశారు. ఆయన వద్ద ఆరు మద్యం సీసాలు పట్టుబడ్డాయి. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ఆయనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఇబి సిఐ ధర్మారావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎన్.రమ్యశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.